క్లుప్తంగా

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

చిల్పూరు: కొమ్ముగుట్టలో గురువారం ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడి మృతి చెందిన కుమారస్వామి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కల్లుగీతే ఆధారంగా కుటుంబాన్ని పోషిస్తున్న కుమారస్వామి మృతితో బాధితులు వీధినపడే పరిస్థితి నెలకొందన్నారు. కావున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని అన్నారు. రంగు రవి, నారగోని రాజు, డిష్ వెంకన్న, మాచర్ల ప్రవీణ్, సట్ల లింగయ్య, పంతం రాజ్‌కుమార్ ఉన్నారు.

పరామర్శ

జఫర్‌గఢ్: ఇటీవల గాయపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఐనవోలులోని నివాసంలో మండలానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బైరి చంద్రమౌళి శుక్రవారం పరామర్శించారు.

బాధిత కుటుంబానికి..

చిల్పూరు: ఫత్తేపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ వీరన్న అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శుక్రవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.2,500 ఆర్థికసాయం అందించారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు భిక్షపతి, రాంలాల్, రవి, బాలరాజు ఉన్నారు.

నియామకం


నారగోని పద్మ

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల ప్రధాన కార్యదర్శిగా ఘన్‌పూర్‌కు చెందిన నారగోని పద్మను నియమించినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలో శుక్రవారం పద్మ విలేకరులతో మాట్లాడారు. పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి కాంగ్రెస్ మహిళా విభాగం మండల ప్రధాన కార్యదర్శిగా నియామకం కావడం సంతోషంగా ఉందన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

కో ఆర్డినేటర్‌గా గణేష్‌గౌడ్



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో నిర్మించనున్న తెలంగాణ అమరవీరుల స్తూపం నిర్మాణ అడ్‌హక్ కమిటీ కోఆర్డినేటర్‌గా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఘన్‌పూర్‌లో గణేష్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల స్తూపం నిర్మాణ కమిటీ కోఆర్డినేటర్‌గా నియామకం కావడం సంతోషంగా ఉందని, ఇందుకు ఎమ్మెల్యే రాజయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ గుండేటి సంపత్ జన్మదినం సందర్భంగా డివిజన్ కేంద్రంలో మీల్స్ ఆన్ వీల్స్ వెహికిల్‌లో శుక్రవారం అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద దాదాపు 200 మందికి అన్నదానం చేపట్టారు. లయన్స్‌క్లబ్ పీడీజీ కేసీ జాన్‌బన్నీ, హరికిషన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి ఆమంచ మధుసూదన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నర్మెట: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని హన్మంతాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బోడబండతండాకు చెందిన ఆంగోత్ జగన్ ద్విచక్ర వాహనంపై దొడ్లగడ్డతండాకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో జనగామ నుంచి నర్మెట వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తూ దుర్గమ్మగుడి ఎదురుగా రోడ్డు పక్కన ఆగి ఉన్న టాటా మాక్సిమోను ఢీకొట్టాడు. దీంతో అతని కుడికాలు తొడ భాగంలో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జనగామకు తరలించారు.

వ్యక్తి రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట శివారు కంచనపల్లి రహదారిలోని వ్యవసాయ క్షేత్రంలో పత్తి తీస్తున్న ఓ వివాహిత మెడలోని పుస్తెల తాడు లాక్కెళ్లేందుకు యత్నించిన ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన బక్క అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎస్.వీరేందర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 25న సదరు వివాహిత పత్తి తీస్తుండగా అనిల్ అక్కడికి చేరుకొని పుస్తెల తాడును లాక్కెళ్లేందుకు యత్నించాడు. అప్రమత్తమైన మహిళ పెద్దగా కేకలు వేయడంతో అనిల్ పరారయ్యాడు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పరీక్షల్లో మనోధైర్యం ముఖ్యం


లింగాలఘణపురం: విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న భిక్షపతి


నర్మెట: మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

- కల్నల్ డాక్టర్ భిక్షపతి

లింగాలఘణపురం: పరీక్షలు రాసే విద్యార్థులు ముందుగా మానసికంగా సిద్ధమై మనోధైర్యంతో ఉండడం ముఖ్యమని కల్నల్ డాక్టర్ భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్ అధ్యక్షతన జరిగిన పీఎం పరీక్షా పే చర్చా కార్యక్రమ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని విద్యార్థుల్లో మనోధైర్యం నింపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షాపే చర్చా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కేవీఎల్ఎన్‌రెడ్డి, పాఠశాల ఏవీ వీరేందర్ పాల్గొన్నారు.


బచ్చన్నపేట: బహుమతులు అందజేస్తున్న సోమిరెడ్డి

పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలి

బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి చదువులో పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, నాయకులు మహేష్, గద్ద రాజు, రవి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారాలను సద్వినియోగం చేసుకోండి

నర్మెట: ప్రధాని మోదీ పరీక్షా పే చర్చ ప్రత్యక్ష ప్రసారాలు ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం నాటి ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైస్కూల్, ఇంటర్ విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ శరత్, వైస్ ప్రిన్సిపాల్ సదానందం, శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్, రాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌టీపీ లక్ష్యం

రఘునాథపల్లి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌టీపీ లక్ష్యమని, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు తమ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పేరిట పాదయాత్ర చేస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముసిపట్ల నరేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రలో భాగంగా షర్మిల త్వరలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో పర్యటించనున్నారని, ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు షర్మిలతోనే సాధ్యం అని అన్నారు.

‘జరసం’ అధ్యక్షుడికి సత్కారం


భాస్కర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కవులు

జనగామ రూరల్: జనగామ రచయితల సంఘం (జరసం) జిల్లా అధ్యక్షుడు పొట్లబత్తిని భాస్కర్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కవులు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కవులు సోమనర్సింహులు, సోమేశ్వరాచారి, కృష్ణ, రెడ్డి రత్నాకర్, ప్రభాకర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


టీషర్టులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

దేవరుప్పుల: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండలంలోని కడవెండి సర్పంచ్ పోతిరెడ్డి బెల్లీనాలినారెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో ఆయన కడవెండి కింగ్స్ క్రీడా జట్టుకు వాలీబాల్ కిట్, టీషర్టులు బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. టీమ్ మెంబర్లు విక్రమ్, ప్రశాంత్, కృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల అందజేత


ఆట వస్తువులు బహూకరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

జనగామ రూరల్: పట్టణానికి చెందిన ఇరుకుల సాయికిషోర్ పుట్టిన రోజు సందర్భంగా లయన్స్ క్లబ్ జనగామ డైమండ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దివ్యాంగుల భవిత పాఠశాలకు శుక్రవారం కుర్చీలు, ఆట వస్తువులు అదంజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ప్రమోద్‌కుమార్, కృష్ణజీవన్ బజాజ్, శ్రీనివాస్, శివరామకృష్ణ, నాగమల్లు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

‘పోస్టల్’ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: పోస్టల్ శాఖ చేపట్టిన పొదుపు పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ నార్త్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయన్నారు. పోస్టల్ ఖాతాల్లో పొదుపు చేసుకునే వారికి మంచి అవకాశాన్ని కల్పించడం జరిగిందని తెలిపారు. వివిధ స్కీముల ద్వారా పొదుపు చేసుకునే వారు ఎక్కువ వడ్డీ పొందే అవకాశం లభిస్తుందన్నారు. 2023 జనవరి నుంచి వడ్డీ రేట్లు అధికంగా పెంచినట్లు తెలిపారు. పోస్టల్ శాఖ చేపట్టిన పొదుపు పథకాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. సమావేశంలో సబ్ పోస్టుమాస్టర్ టి.విజయ్, ఏబీఎం ఎండి అంకూస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

జీపీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు


మాట్లాడుతున్న సర్పంచ్ మల్లేశం

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అనుమతులు లేకుండా ఎవ్వరూ ఇళ్ల నిర్మాణాలు చేయవద్దని, నిబంధనల్ని అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పవని విశ్వనాథపురం గ్రామ సర్పంచ్ అనుమాల మల్లేశం హెచ్చరించారు. విశ్వనాథపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి విశ్వనాథపురంలో సర్వే నంబర్ 9/ఈ లోని భూమిలో గ్రామ పంచాయతీ, కుడా అనుమతులు లేకుండా అక్రమంగా ప్లాటింగ్ చేసి విక్రయాలు చేశారన్నారు. ఇప్పటికే ఇందులో ప్లాట్లు కొన్న కొందరు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తున్నారని, గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తే అడ్డుకుంటామన్నారు. ఈ విషయమై రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి తాళ్లపెల్లి భవాని, ఉపసర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు చేయూత


బహుమతులు అందజేస్తున్న సద్దాం హుస్సేన్

కొడకండ్ల: చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభను చాటే విద్యార్థులకు తనవంతుగా నగదు సహకారాన్ని అందిస్తానని ఎస్ఎస్ కార్‌కేర్ ప్రొప్రైటర్ సద్దాం హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఏడునూతుల ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 7వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన షేక్ అబ్బాస్‌కు రూ.3వేలు, సుజితకు రూ.2వేల నగదు బహుమతిని, అలాగే క్రీడల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు రూ.8వేల నగదును ఆయన అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సంపత్, సర్పంచ్ పద్మజ, ఎస్ఎంసీ చైర్మన్ యాకన్న, బాబర్, భాస్కర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యచికిత్సకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

పాలకుర్తిటౌన్: మండలంలోని గోపాలపురంలో ప్రమాదవశాత్తు మంటల్లో పడి 60 శాతం కాలిన గుగుల్ల సంపత్ కుమార్తెకు వైద్య చికిత్స కోసం శుక్రవారం జైభీమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.11 వేల ఆర్థికసాయం అందజేశారు. జైభీమ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు గుండె రాజు, ప్రధాన కార్యదర్శి చెరిపెల్లి సునీల్, రఘు, మహేందర్ పాల్గొన్నారు.

బోర్ పనులు ప్రారంభం



లింగాలఘణపురం: పటేల్‌గూడెంలోని వైకుంఠధామంలో నీటి సౌకర్యం కోసం మండల పరిషత్ నుంచి మంజూరైన నిధులతో శుక్రవారం ప్రజాప్రతినిధులు బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. సర్పంచ్ దేవేంద్రమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సిద్దు, బీఆర్‌ఎస్ మండల సమన్వయ కన్వీనర్ నాగేందర్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీపీఓకు ఫిర్యాదు


డీపీఓకు ఫిర్యాదు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై వెంటనే విచారణ జరిపించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారికి శుక్రవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకుడు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మొగిళిపాక నర్సింగం, నాయకులు జ్యోతి యాకయ్య, రాపర్తి సోమయ్య, ఇల్లందుల మొగిళి విలేకరులతో మాట్లాడుతూ జఫర్‌గఢ్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇట్టి నిధులను గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేయకుండా సర్పంచ్ బల్లెపు నర్సింగరావు, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ రాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కలిసి నిధులు స్వాహా చేశారన్నారు. దీనిపై వెంటనే అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు కన్న సోమశేఖర్, తాడెం కుమార్, వార్డు సభ్యులు కుక్కల ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆలయంలో కుంభాభిషేక పూజలు


ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం సంప్రోక్షణ, పుణ్యవచనం, మహాకుంబాభిషేక పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు, దాతల సహకారంతో ఇటీవల దేవాలయం ఆవరణలో శాబాది బండలు వేయడం, గర్భగుడిలో గ్రానైట్ టైల్స్, దేవాలయంలో లైటింగ్, నీటి సౌకర్యం తదితర అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి 11.30 గంటల వరకు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో భక్తుల మధ్య శ్రీవేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు సంప్రోక్షణ, పుణ్యహవచనం, కుంబాభిషేకం పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు ప్రతీ ఇంటి నుంచి ఒక బిందెడు నీళ్లను తీసుకువచ్చి మూలవిరాట్‌కు స్వహస్తాలతో కుంబాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో దాతలు, భక్తులు కొల్లూరి కృష్ణమూర్తి, కె.వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మెజీషియన్ జాలుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎం.యాకయ్య, దామెర వేణు, కె.మహేష్, బి.సంపత్, ప్రకాష్‌రెడ్డి, ఆరూరి జయప్రకాష్, ఆకుల రవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటి వెలుగు’


కంటిపరీక్ష చేస్తున్న వైద్యురాలు

బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్, బచ్చన్నపేట గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ ఆలింపూర్‌లో 110 మంది, బచ్చన్నపేటలో 140 మందికి కంటి పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. అవసరమున్న వారికి కంటి అద్దాలను అందించామన్నారు. దశలవారిగా అన్ని గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అనిల్ రాజ్, రేవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు


భూమిపూజలో సర్పంచ్ ప్రత్యూష

చిల్పూరు: అంబేడ్కర్ అందరివాడని, గ్రామంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డి అన్నారు. శ్రీపతిపల్లిలో శుక్రవారం అంబేడ్కర్ వాది, బీఆర్‌ఎస్ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సర్పంచ్ హాజరై భూమిపూజ చేశారు. ఉప సర్పంచ్ గొంగిడి అనూరాధాకృష్ణమూర్తి, వార్డు సభ్యులు, మహిళాసంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నపెండ్యాలలో మూడు చోట్ల చోరీలు

- భయాందోళనలో గ్రామస్తులు
- ఫిర్యాదు చేయని బాధితులు

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన శాగ వెంకటేశ్వర్లు రోజు మాదిరిగానే గురువారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశాడు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. అలాగే మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన నాగరబోయిన శోభ చిన్నపెండ్యాల–తరిగొప్పుల రోడ్డులోని తాటికాయల క్రాస్‌వద్ద పండ్ల డబ్బా ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటోంది. రోజు మాదిరిగానే గురువారం రాత్రి డబ్బా మూసివేసి ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. డబ్బాలో పండ్లతో పాటు రూ. 3వేలు నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మరో ఘటనలో చిన్నపెండ్యాలకు చెందిన ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకుడు వంశీ ఇంటి తలుపులు గుర్తుతెలియని వ్యక్తులు తీసేందుకు యత్నించగా అవి రాకపోవడంతో పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. మంటలను గమనించిన ఇంటి యజమానులు అరవడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. ఒకేరోజు రాత్రి మూడు చోట్ల చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఎస్సై వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. విచారణ జరిపి త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

పద్మశాలీలు ఉనికిని కాపాడుకోవాలి

బచ్చన్నపేట: పద్మశాలీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి అందరూ సంఘటితం కావాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల బాల్‌రాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా ఎదగకుండా పలు శక్తులు అడ్డుకుంటున్నాయని, అందులో భాగంగానే జగిత్యాల మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణి రాజీనామానే కారణమన్నారు. సమాజానికి అన్ని విధాలుగా సేవలను అందిస్తున్న పద్మశాలీల ఆత్మగౌరవానికి భంగం కలిగితే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం


జనగామ రూరల్: జెడ్పీ సీఈఓను సన్మానిస్తున్న ఉద్యోగులు


స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్డీఓను సన్మానిస్తున్న తహసీల్దార్, ఆర్ఐలు


పాలకుర్తి టౌన్: ప్రశంస పత్రాలు అందుకున్న వారిని సన్మానిస్తున్న ఎంపీపీ నాగిరెడ్డి తదితరులు

జనగామ రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసపత్రం అందున్న జెడ్పీ సీఈఓ వసంతను శుక్రవారం జెడ్పీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సోమనర్సయ్య, ప్రవీణ్‌కుమార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు..

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఉత్తమ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ)గా ప్రశంసపత్రం అందుకున్న ఘన్‌పూర్ ఆర్డీఓ కృష్ణవేణిని ఘన్‌పూర్ తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

తహసీల్దార్‌కు..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసపత్రం అందుకున్న ఘన్‌పూర్ తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్‌ను ఆర్ఐలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. డీఏఓ క్రాంతికుమార్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు..

పాలకుర్తి టౌన్: మండలంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తములుగా ప్రశంసపత్రం అందుకున్న సందర్భంగా ఎంపీపీ నల్లా నాగిరెడ్డి వారిని సన్మానించారు. సన్మానం పొందిన వారిలో ఎంపీడీఓ వనపర్తి అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏఈఓ ముత్తినేని వెంకటేష్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ కుమార్, ఎంపీడీఓ కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ వెంకటయ్య ఉన్నారు.